ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ
అన్ని నియోజకవర్గాల్లో
విజ్ఞాన్ పత్రికకు
విలేఖరులు కావలెను
ఫోన్ నెం. 9951775293

VIGNAN PATRIKA
# విజ్ఞాన్ పత్రిక
తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)
APTEL/2024/89102

సంపుటి : 02 సంచిక : 122 చీఫ్ ఎడిటర్.. కలికి ఉదయ్ కుమార్ రెడ్డి, పేజీలు : 08, వెల రూ. 1/- మంగళవారం - 02 - జూన్ - 2026



### రైతు డిస్కం పేరిట విద్యుత్తు ప్రైవేటీకరణకు కుట్ర: కె.కవిత

- రైతుల అభిప్రాయాలు తీసుకోకుండా రైతు డిస్కం ఏర్పాటు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధం'
- 'ఆరు నెలలుగా రహస్యంగా ఉంచిన రైతు డిస్కం అంశాన్ని ఇప్పుడు బయటపెట్టడం వెనుక పెద్ద వ్యూహమే ఉంది
- మిగిలిన రెండు డిస్కంలను ప్రైవేటుపరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలున్నాయి
- పాలమూరు ప్రాజెక్టులో భాగమైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను దసరాలోపు ప్రారంభించాలి

# పన్ను చెల్లించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

## గ్రామ పంచాయతీల ఆర్థిక బలోపేతంపై పవన్ దృష్టి

★ పన్నుల ఎగవేత దారులపై పవన్ కల్యాణ్ ఉక్కుపాదం.. డిఫాల్టర్ పరిశ్రమలు, విద్యాసంస్థలే టార్గెట్!

★ పరిశ్రమలు, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు ఎందుకు పన్నులు చెల్లించడం లేదని ప్రశ్న



అమరావతి: గ్రామ పంచాయతీల ఆర్థిక బలోపేతం, క్షేత్రస్థాయిలో పన్నుల వసూళ్లను వేగవంతం చేయడంపై ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. పంచాయతీలకు చెల్లించాల్సిన పన్నులను ఎగవేస్తున్న భారీ పరిశ్రమలు, ప్రైవేట్ విద్యాసంస్థలపై మిగతా 2 లో



విధ్వంసకర పాలన నుంచి జూన్ 4వ తేదీన

## ఓటుతో విముక్తి కల్పించారు

మీటింగ్ ల నుంచి జనం వెళ్లిపోకుండా కందకాలు తవ్వారు: చామవరం సభలో చంద్రబాబు

- తుని నియోజకవర్గం చామవరంలో 'పేదల సేవలో' సభ
- గత ప్రభుత్వంపై విరుచుకుపడిన సీఎం చంద్రబాబు
- నాడు భయానక వాతావరణం ఉండేదని విమర్శలు
- బహిరంగంగా నవ్వాలన్నా భయపడే పరిస్థితి ఉండేదని వ్యాఖ్యలు
- అది చరిత్రలో నిలిచిపోయే రోజన్న చంద్రబాబు

అమరావతి: గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో భయానక వాతావరణం ఉండేదని, బహిరంగ సభలకు వచ్చిన ప్రజలు మధ్యలో వెళ్లిపోకుండా అడ్డుకోవడానికి ఏకంగా కందకాలు తవ్వి, ఫెన్సింగ్‌లు వేసి నిర్బంధించే దుస్థితి ఉండేదని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శించారు. బహిరంగంగా నవ్వాలన్నా భయపడే పరిస్థితి ఉండేదని వ్యాఖ్యానించారు. మిగతా 2 లో

పశ్చిమాసియాలో శాంతికి

## 'భారత్' ఒక్కటే మార్గం

### పశ్చిమాసియా స్థిరత్వంలో భారత్‌ది కీలక పాత్రన్న ఇజ్రాయెల్ రాయబారి

- భారత్ ఆర్థిక వృద్ధి ద్వారా ఈ ప్రాంతానికి ట్రిలియన్ డాలర్ల లబ్ధి
- భారతీయుల్లో ఇజ్రాయెల్ పట్ల 'క్రేజీ లవ్' ఉందన్న ప్రధాని నెతన్యాహు



ఢిల్లీ: భౌగోళిక ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో పశ్చిమాసియా ప్రాంతంలో శాంతి భద్రతలను నెలకొల్పడానికి మిగతా 2 లో

# ప్రైవేట్ సంస్థ కోసం టెండర్ రూల్స్ మార్చారు

## సీబీఎస్ఈ టెండర్లలో అవినీతి జరిగింది

- ఫోన్లతో ఆన్సర్ షీట్ల స్కానింగ్‌.. సీబీఎస్ఈ ఉదంతంపై రాహుల్ గాంధీ నిప్పులు!
- మొబైల్ ఫోన్లతో ఆన్సర్ షీట్లను స్కాన్ చేసినట్లు వెల్లడి
- పోర్టల్ హ్యాక్ చేసి లోపాలను బయటపెట్టిన ఎథికల్ హ్యాకర్
- విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్



ఢిల్లీ: మొబైల్ ఫోన్లతో ఆన్సర్ షీట్లను స్కాన్ చేసి దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి మిగతా 2 లో

ఇరాన్ రాజకీయాల్లో కార్చిచ్చు: 'సైనిక తిరుగుబాటు' అంటూ

## అధ్యక్షుడు పెజెష్కియాన్ రాజీనామా



- ఐఆర్‌జీసీ కమాండర్ల చేతుల్లోకి వెళ్లిన దేశ సర్వాధికారాలు
- క్షిపణి దాడులను 'పిచ్చిచర్య'గా అభివర్ణించిన అధ్యక్షుడు
- సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీకి లేఖ
- టెహ్రాన్‌లో తీవ్ర రాజకీయ సంక్షోభం!

విశాఖలో ఫ్యూచర్ క్యాంపస్

# ఏర్పాటు చేయాలి

## విశాఖను డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం

- ఎయిర్‌ట్రంక్‌కు ఆహ్వానం.. విశాఖలో మరో భారీ పెట్టుబడిపై లోకేష్ ఫోకస్
- ఎయిర్‌ట్రంక్ సీఈఓ రాబిన్ ఖుదాతో మంత్రి నారా లోకేష్ భేటీ
- ఇప్పటికే భారత్‌లోకి ప్రవేశించిన ఎయిర్‌ట్రంక్ సంస్థ
- ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని సీఈఓ హామీ



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. మిగతా 2 లో

## 'సర్'పై అప్రమత్తంగా ఉండాలి: కేటీఆర్

జూన్ 25 నుండి సర్ ప్రారంభమవుతుంది



- "కాంగ్రెస్ పాలనలో పరిశ్రమలకు వారానికి మూడు రోజులు పవర్ హాలిడే ఉండేది
- 65 సంవత్సరాలలో కాంగ్రెస్ చేయని పని ఆరు నెలల్లో కేసీఆర్ చేసి చూపించారు
- 24 గంటల పాటు రైతులకు, పరిశ్రమలకు కేసీఆర్ నాణ్యమైన కరెంటు ఇచ్చారు"

నీట్ రీ-టెస్ట్‌పై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు..

## సీబీటీ పిటిషన్ తిరస్కరణ



- నీట్ రీ-టెస్ట్‌ను కంప్యూటర్ విధానంలో నిర్వహించాలన్న పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు
- జూన్ 21న ఓఎంఆర్ పద్ధతిలోనే పరీక్ష

# లివర్ క్యాన్సర్‌కు తొలి అడ్వాన్స్‌డ్ మైక్రోవేవ్ అబ్లేషన్ విజయవంతం

## శస్త్రచికిత్స లేకుండా అత్యాధునిక "స్కార్‌లెస్ కేన్సర్ థెరపీ" అందించిన మెడికవర్ ఆసుపత్రి నిపుణులు

.నెల్లూరు, విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్: ఇంటర్వెన్షనల్ ఆంకాలజీ మరియు ఆధునిక మినిమల్లీ ఇన్వేసివ్ క్యాన్సర్ చికిత్స రంగంలో నెల్లూరులో అరుదైన వైద్య మైలురాయిని మెడికవర్ హాస్పిటల్స్ నెల్లూరు సాధించింది. అత్యంత క్లిష్టమైన హెపటోసెల్యులార్ కార్సినోమా (లివర్ క్యాన్సర్) కేసుకు అడ్వాన్స్‌డ్ మైక్రోవేవ్ అబ్లేషన్ ప్రక్రియను ప్రముఖ ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డా. నెరెళ్ల కృష్ణ తేజ సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ విజయవంతంగా నిర్వహించారు.నెల్లూర, పరిసర ప్రాంతాల్లో సుమారు 100--150 కిలోమీటర్ల పరిధిలో ఇంత క్లిష్టమైన లివర్ క్యాన్సర్‌కు ఈ స్థాయి అడ్వాన్స్‌డ్ మైక్రోవేవ్ అబ్లేషన్విజయవంతంగా నిర్వహించడం ఇదే తొలిసారి కావడం విశేషం అని ఆయన తెలిపారు.రోగికి లివర్‌లో ప్రాంతంలో లోతుగా ఉన్న హెపటోసెల్యులార్ కార్సినోమా నిర్ధారణ అయింది. ఈ ట్యూమర్ ప్రధాన పోర్టల్ వెయిన్ విభజనకు అత్యంత సమీపంలో ఉండటంతో పాటు కీలకమైన రక్తనాళాలను చుట్టుముట్టి ఉండడం వల్ల కేసు అత్యంత సవాలుగా మారింది. అదనంగా రోగికి అడ్వాన్స్‌డ్ లివర్ సిర్రోసిస్ మరియు సైనుసోయిడల్ పోర్టల్ హైపర్‌టెన్షన్ ఉండటంతో సాధారణ శస్త్రచికిత్స చాలా ప్రమాదకరంగా మారింది.ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా డా. నెరెళ్ల కృష్ణ తేజ అత్యాధునిక ఇమేజ్ గైడెడ్ మైక్రోవేవ్ అబ్లేషన్ సాంకేతికతను వినియోగించి అత్యంత ఖచ్చితత్వంతో ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. ప్రధాన రక్తనాళాలకు సమీపంలో ఉన్న ట్యూమర్లను చికిత్స చేయడం వైద్యరంగంలో అత్యంత క్లిష్టమైన ప్రక్రియలలో ఒకటిగా భావిస్తారు. రక్తస్రావం, రక్తనాళాల నష్టం, ట్యూమర్ పూర్తిగా నశించకపోవడం, లివర్ పనితీరు దెబ్బతినే ప్రమాదాలు అధికంగా ఉంటాయి.అయితే ఈ మొత్తం చికిత్సను ఎలాంటి ఓపెన్ సర్జరీ లేకుండా, జనరల్ అనస్థీషియా అవసరం లేకుండానే డే కేర్ విధానంలో పూర్తి చేయడం విశేషం. చికిత్స మొత్తం సమయంలో రోగి పూర్తిగా చైతన్యంతో, సౌకర్యంగా ఉండగా అనంతరం వేగంగా కోలుకున్నారు.చిన్న సూది రంధ్రం ద్వారా అత్యాధునిక ఇమేజింగ్మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ చికిత్సలో ఎలాంటి కోతలు, కుట్లు, గాయాలు లేదా గణనీయమైన రక్తనష్టం లేకపోవడం వల్ల ఇది నిజమైన "స్కార్‌లెస్ కీహోల్ క్యాన్సర్ థెరపీ"గా నిలిచింది. రోగికి తక్కువ నొప్పి, వేగవంతమైన కోలుకోవడం, త్వరితగతిన సాధారణ జీవనానికి చేరుకునే అవకాశం లభించింది. ఈ సందర్భంగా డా. నెరెళ్ల కృష్ణ తేజ మాట్లాడుతూ, "ఆధునిక ఇంటర్వెన్షనల్ రేడియాలజీ క్యాన్సర్ చికిత్సలో



విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. ముఖ్యంగా లివర్ సిర్రోసిస్ లేదా పోర్టల్ హైపర్‌టెన్షన్ కారణంగా పెద్ద శస్త్రచికిత్సలకు అనుకూలం కాని రోగులకు అత్యంత ఖచ్చితత్వంతో, అవయవాన్ని కాపాడే మినిమల్లీ ఇన్వేసివ్ చికిత్సలు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా తక్కువ ఆసుపత్రి దినాలు, వేగవంతమైన రికవరీ, తక్కువ సమస్యలు మరియు మెరుగైన రోగి సౌకర్యం సాధ్యమవుతోంది" అని తెలిపారు.ఈ విజయవంతమైన చికిత్సతో మెడికవర్ హాస్పిటల్స్ నెల్లూరు, ఆధునిక మినిమల్లీ ఇన్వేసివ్ ఆంకాలజీ మరియు ఇంటర్వెన్షనల్ రేడియాలజీ సేవల్లో అగ్రశ్రేణి వైద్యసంస్థగా మరోసారి తనసామర్థ్యాన్ని నిరూపించుకుంది. అలాగే డా. నెరెళ్ల కృష్ణ తేజను అడ్వాన్స్‌డ్ ఇంటర్వెన్షనల్రేడియాలజీ, ఇంటర్వెన్షనల్ఆంకాలజీ, హెపటోబిలియరీ ఇంటర్వెన్షన్స్, ఇమేజ్ గైడెడ్ ట్యూమర్ అబ్లేషన్ మరియు మినిమల్లీ ఇన్వేసివ్ వాస్క్యులర్ థెరపీలలో ప్రముఖ నిపుణుడిగా నిలబెట్టింది. ఈ కార్యక్రమం లో మెడికవర్ హాస్పిటల్ సెంటర్ హెడ్ లావణ్య మరియు వీఆర్వో గోసల. సురేంద్ర రెడ్డి పాల్గొన్నారు



## తెలంగాణ ఏర్పాటును పవన్ తీవ్రంగా వ్యతిరేకించారు

- హైదరాబాద్ సభపై పవన్ కల్యాణ్‌కు పొన్నం ప్రభాకర్ అల్టిమేటం.. క్షమాపణ చెప్పాకే అడుగుపెట్టాలని డిమాండ్!
- హైదరాబాద్‌లో జనసేన 'నవనిర్మాణ సభ'
- హైదరాబాద్‌లోనే పవన్ ఎందుకు సభ పెడుతున్నారని ప్రశ్న

హైదరాబాద్: హైదరాబాద్‌లో జనసేన అధినేత, ఏపీ పవన్ కల్యాణ్ నిర్వహించ తలపెట్టిన 'నవనిర్మాణ సభ'పై తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మిగతా 2 లో

VIGNAN PATRIKA
APTEL/2024/89102
విజ్ఞాన్ పత్రిక
తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)


# విధ్వంసకర పాలన నుంచి జూన్ 4వ తేదీన ఓటుతో విముక్తి కల్పించారు

మొదటి పేజి తరువాయి

అలాంటి విధ్వంసకర పాలన నుంచి జూన్ 4వ తేదీన ప్రజలు తమ ఓటుతో రాష్ట్రానికి విముక్తి కల్పించారని, ఆ రోజు చరిత్రలో నిలిచిపోతుందని ఆయన అన్నారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలోని చామవరం గ్రామంలో సోమవారం జరిగిన 'పేదల సేవలో' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గత పాలకులు బటన్ నొక్కి పైశాచిక ఆనందం పొందేవారని, ప్రజల కష్టసుఖాలు తెలుసుకునే ప్రయత్నం చేయలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం ప్రజలతో మమేకమవుతూ, నేరుగా వారి వద్దకే సేవలు అందిస్తోందని స్పష్టం చేశారు.

పేదలే తొలి ప్రాధాన్యం – పెంచిన పింఛన్లే నిదర్శనం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజు నుంచే పేదల కోసం పనిచేస్తోందని, దానికి పెంచిన పింఛన్లే నిదర్శనమని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రం రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో ఉన్నప్పటికీ, ఇచ్చిన మాటకు కట్టుబడి తొలి నెల నుంచే పింఛన్లను పెంచి అందిస్తున్నామని చెప్పారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ కింద ఒకేసారి రూ.1,000 పెంచి రూ.4,000 చేశామని, దివ్యాంగులకు రూ.6,000కు పెంచామని గుర్తు చేశారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడేవారికి ఆరోగ్య పింఛన్లను రూ.10,000, రూ.15,000కు పెంచామని వివరించారు. 2024 జూలై నుంచి ఇప్పటివరకు పింఛన్ల రూపంలో రూ.65,887 కోట్లు అందించామని, ఏడాదికి ఈ ఒక్క పథకం కోసమే దాదాపు రూ.32 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ఈ నెల రాష్ట్రవ్యాప్తంగా 62.34 లక్షల మందికి రూ.2,729 కోట్లు పంపిణీ చేస్తున్నామని, దేశంలో మరే రాష్ట్రంలోనూ ఇంత పెద్ద మొత్తంలో పింఛన్లు ఇవ్వడం లేదని అన్నారు.

సంక్షేమంతో పాటు అభివృద్ధి, ఉపాధి

పేదరికం లేని సమాజాన్ని చూడాలన్నదే తన కల అని చంద్రబాబు అన్నారు. కేవలం పింఛన్లే కాకుండా 'తల్లికి వందనం', 'స్త్రీశక్తి', 'అన్నదాత సుఖీభవ' వంటి అనేక పథకాల ద్వారా పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, చేనేతలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధి, ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. గడిచిన 23 నెలల్లో రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని, తద్వారా 23 లక్షల ఉద్యోగాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కాకినాడ సమీపంలో రూ.80 వేల కోట్లతో గ్రీన్ అమ్మోనియా పరిశ్రమ, అనకాపల్లి వద్ద ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ సిటీ, విశాఖలో గూగుల్ డేటా సెంటర్ వంటివి యువతకు ఉపాధి మార్గాలు చూపుతాయని అన్నారు.

### విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు

పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పాఠశాలల్లో పాఠ్యాంశాలు మారుస్తున్నామని, నాణ్యమైన విద్యను అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ఖరీదైన వైద్యం కోసం ప్రజలు అప్పులపాలు కాకుండా 'యూనివర్సల్ హెల్త్ పాలసీ' తీసుకువస్తున్నామని ప్రకటించారు. 'సంజీవని' పేరుతో ప్రతి పౌరుడికి డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందించి, ప్రివెంటివ్, ప్రిడిక్టివ్, క్యూరేటివ్ విధానంలో ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తామని తెలిపారు. డాక్టర్ అపాయింట్‌మెంట్లు, ఆరోగ్య సందేహాల నివృత్తి కోసం 'ఏఐ డాక్టర్' సేవలను కూడా అందుబాటులోకి తెస్తామని వివరించారు. రాష్ట్రాన్ని 'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్'గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆయన అన్నారు.

ప్రాంతీయ అభివృద్ధి.. పోలవరం పూర్తి

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. శ్రీకాకుళం నుంచి ఉమ్మడి తూర్పు గోదావరి వరకు విశాఖ రీజియన్‌గా, పశ్చిమ గోదావరి నుంచి ప్రకాశం వరకు అమరావతి రీజియన్‌గా, తిరుపతి కేంద్రంగా రాయలసీమ రీజియన్‌గా అభివృద్ధి చేస్తామని తెలిపారు. 2027లో గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహిస్తామని, ఆ లోపే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని స్పష్టం చేశారు. పోలవరం ఎడమ కాలువ పనులను జూలై నాటికి పూర్తి చేసి నీరందిస్తామని చెప్పారు. మత్స్యకారుల కోసం రూ.240 కోట్లతో 200 మెకనైజ్డ్ బోట్లను సబ్సిడీపై అందిస్తామని, అమీనాబాద్ ఫిషింగ్ హార్బర్ కోసం రూ.80 కోట్లు మంజూరు చేస్తామని ప్రకటించారు.

### సుపరిపాలనే ధ్యేయం.. కలిసికట్టుగా ముందుకు

ప్రజలకు నాణ్యమైన పౌరసేవలు అందించడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి అన్నారు. అందుకే 'వాట్సాప్ గవర్నెన్స్' ద్వారా పాలనను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నామని చెప్పారు. '2047 స్వర్ణాంధ్ర విజన్'తో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీర్చిదిద్దుతామని పునరుద్ఘాటించారు. ఈ యజ్ఞంలో మిత్రుడు పవన్ కల్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీలతో కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కాకినాడ జిల్లాలో పౌరసేవలు సంతృప్తికరంగా అందించిన ప్రభుత్వ యంత్రాంగాన్ని ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

## విశాఖలో ఫ్యూచర్ క్యాంపస్ ఏర్పాటు చేయాలి

మొదటి పేజి తరువాయి

ఇందులో భాగంగా, ప్రపంచవ్యాప్తంగా హైపర్‌స్కేల్ డేటా సెంటర్లను నిర్వహిస్తున్న ప్రఖ్యాత సంస్థ ఎయిర్‌ట్రంక్ సీఈఓ రాబిన్ ఖుదాతో ముంబయిలో ఆయన కీలక సమావేశం నిర్వహించారు. విశాఖపట్నంలో 'ఎయిర్‌ట్రంక్ ఫ్యూచర్ క్యాంపస్'ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా లోకేష్ విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ, "విశాఖపట్నం వేగంగా ఏఐ, డేటా హైపర్‌స్కేల్ హబ్‌గా ఆవిర్భవిస్తోంది. ఇప్పటికే గూగుల్ ఏఐ హబ్, రిలయన్స్ ఏఐ డేటా సెంటర్, అదానీకనెక్స్ వంటి దిగ్గజ సంస్థల ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయి. డేటా సెంటర్ల ఏర్పాటుకు విశాఖ అన్ని విధాలా అనుకూలమైన నగరం. ఇక్కడ 6 గిగావాట్ల డేటా సెంటర్లను నెలకొల్పాలన్నది మా లక్ష్యం. మల్టీ-గిగావాట్ ఏఐ మౌలిక సదుపాయాలు, సంపూర్ణ ఎకోసిస్టమ్ అభివృద్ధిపై మేం ప్రత్యేక దృష్టి సారించాం" అని వివరించారు. భారతదేశంలో మరే ఇతర ప్రాంతంలో లేని కనెక్టివిటీ, మౌలిక సదుపాయాలు ఏపీలో అందుబాటులో ఉన్నాయని, డేటా సెంటర్లకు అవసరమైన నిరంతర విద్యుత్ కోసం పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు కూడా సిద్ధంగా ఉన్నాయని లోకేష్ తెలిపారు. ఎయిర్‌ట్రంక్‌ను ఏపీకి తీసుకురావాలన్న ప్రయత్నాలు గత కొంతకాలంగా జరుగుతున్నాయి. గత ఏడాది అక్టోబర్‌లో మంత్రి లోకేష్ ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా తొలిసారి రాబిన్ ఖుదాతో సమావేశమై ఏపీ దార్శనికతను వివరించారు. ఆ తర్వాత ఎయిర్‌ట్రంక్ బృందం, ఆంధ్రప్రదేశ్ ఉన్నతాధికారులతో పలుమార్లు చర్చలు జరిపింది. అయితే, భారత్‌లో కార్యకలాపాలకు ఒక ప్లాట్‌ఫాం ఏర్పాటు చేసుకున్న తర్వాతే విస్తరణపై నిర్ణయం తీసుకుంటామని అప్పట్లో ఎయిర్‌ట్రంక్ తెలిపింది. ఈ నేపథ్యంలో, ఎయిర్‌ట్రంక్ ఈ ఏడాది ఏప్రిల్‌లో అధికారికంగా భారతదేశంలోకి ప్రవేశించింది. బ్లాక్‌స్టోన్ మద్దతు ఉన్న డేటా సెంటర్ ప్లాట్‌ఫాం 'లుమినా క్లౌడ్‌ఇన్‌ఫ్రా'ను టేకోవర్ చేసింది. ఈ స్వాధీనంతో ముంబయి, చెన్నై, హైదరాబాద్‌లలో సుమారు 600 మెగావాట్ల సామర్థ్యంతో ప్రాజెక్టులు ఆ సంస్థ చేతికి వచ్చాయి. ఇది ఎయిర్‌ట్రంక్‌కు భారత్‌లో తక్షణ కార్యకలాపాలకు మార్గం సుగమం చేసింది. తమ ఆసియా పసిఫిక్ వ్యూహంలో భారత్‌ను ఒక ప్రధాన వృద్ధి మార్కెట్‌గా ఆ సంస్థ గుర్తించింది. ఈ తాజా పరిణామాల నేపథ్యంలో, లోకేష్ మరోసారి రాబిన్ ఖుదాతో భేటీ అయి, ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు. దీనిపై రాబిన్ ఖుదా స్పందిస్తూ... ఎయిర్‌ట్రంక్ భారత ప్రణాళికలు, లుమినా క్లౌడ్‌ఇన్‌ఫ్రా ఏకీకరణ, భవిష్యత్ విస్తరణ రోడ్‌మ్యాప్ వంటి అంశాలను చర్చించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను నిశితంగా పరిశీలించి, సానుకూల నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ భేటీతో విశాఖలో మరో భారీ పెట్టుబడికి మార్గం సుగమం అవుతుందని ప్రభుత్వ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

## ప్రైవేట్ సంస్థ కోసం టెండర్ రూల్స్ మార్చారు

మొదటి పేజి తరువాయి

నెట్టేశారంటూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వం, సీబీఎస్ఈ బోర్డుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 12వ తరగతి డిజిటల్ మూల్యాంకన ప్రక్రియ టెండర్లలో భారీ అవినీతి జరిగిందని ఆరోపించారు. ఓ ప్రైవేట్ సంస్థకు లబ్ధి చేకూర్చేందుకు నిబంధనలను తుంగలో తొక్కడం వల్లే విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని ధ్వజమెత్తారు.

ఒక్క కంపెనీ కోసం?

ఈ వివాదంపై పరిశోధన చేసిన విద్యార్థి సార్థక్ సిద్ధాంత్ నివేదికను రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. "మే 2025లో విడుదల చేసిన సీబీఎస్ఈ టెండర్ నిబంధనల ప్రకారం.. ఆన్సర్ షీట్లను ఆటోమేటిక్ రోబోటిక్ స్కానర్లతో కనీసం 300 డీపీఐ స్పష్టతతో స్కాన్ చేయాలి. కానీ ఆగస్టులో మళ్లీ విడుదల చేసిన టెండర్‌లో ఈ రూల్స్ అన్నింటినీ గుట్టుచప్పుడు కాకుండా తొలగించారు" అని రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా ఆరోపించారు. 'కోఎఫ్ట్ ఎడ్యూటెక్' అనే ఒకే ఒక్క ప్రైవేట్ కంపెనీకి ఈ కాంట్రాక్ట్ కట్టబెట్టడానికే నిబంధనలను మార్చారని ఆరోపించారు.

మొబైల్ ఫోన్లతో స్కాన్

టెండర్ మార్పుల వల్ల స్కాన్ల క్వాలిటీని 200 డీపీఐకి తగ్గించారని చివరికి సదరు సంస్థ ఆన్సర్ షీట్లను ప్రొఫెషనల్ స్కానర్లతో కాకుండా మొబైల్ ఫోన్లతో స్కాన్ చేసిందని రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. ఫలితంగా ఆన్‌లైన్ పోర్టల్‌లో పేజీలు సరిగ్గా కనిపించకపోవడం, బ్లర్‌గా మారడం, కొన్ని పేజీలు పూర్తిగా మాయమవడం వంటి దారుణాలు జరిగాయన్నారు. ఇవన్నీ పొరపాట్లు కావని, ఒక వెండర్‌కు లాభం చేకూర్చడం కోసం చేసిన పక్కా ప్లాన్ అని, ఇది ముమ్మాటికీ పెద్ద మోసమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రధాని మౌనంపై విమర్శలు

దాదాపు 18.5 లక్షల మంది విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేసిన ఈ భారీ స్కామ్‌పై ప్రధానమంత్రి మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని రాహుల్ ప్రశ్నించారు. ఈ ఘోర వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ఎథికల్ హ్యాకర్ బయటపెట్టిన లోపాలు

మరోవైపు 19 ఏళ్ల ఎథికల్ హ్యాకర్ నిసర్గ అధికారి కూడా ఈ డిజిటల్ మూల్యాంకన పోర్టల్‌లోని భద్రతా లోపాలను స్క్రీన్ షాట్లతో సహా బయటపెట్టారు. ఇంటర్నెట్ ఉన్న ఎవరైనా విద్యార్థుల ఆన్సర్ షీట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని నిరూపించారు. అలాగే స్కాన్ చేసిన పేజీలపై మొబైల్ ఫోన్ల నీడలు, మడతలు స్పష్టంగా కనిపిస్తున్నాయని సార్థక్ సిద్ధాంత్ కూడా ఆధారాలను బయటపెట్టారు. ప్రొఫెషనల్ స్కానర్లు వాడితే ఇలాంటి నీడలు రావడం అసాధ్యమని బోర్డును ప్రశ్నించారు.

## పన్ను చెల్లించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

మొదటి పేజి తరువాయి

కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ రంగాల నుంచి పేరుకుపోయిన పన్ను బకాయిలపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సామాన్య పౌరులు తమ పన్నులను క్రమబద్ధంగా చెల్లిస్తున్నప్పుడు.. పెద్ద పెద్ద పరిశ్రమలు, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు తమ బాధ్యతలను ఎందుకు విస్మరిస్తున్నాయని ఆయన సూటిగా ప్రశ్నించారు. "సాధారణ ప్రజలు ఎంతో నిజాయతీగా పన్నులు కడుతున్నారు. మరి పరిశ్రమలు, ప్రైవేట్ విద్యాసంస్థలు పంచాయతీలకు చెల్లింపులు చేయడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నాయి? ఎందుకు ఎగవేస్తున్నాయి?" అని పవన్ నిలదీశారు. పన్నుల రికవరీ ప్రక్రియలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని ఉపముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. సదరు సంస్థల నుంచి పెండింగ్‌లో ఉన్న అన్ని పన్నులను పూర్తిగా రికవరీ చేయడానికి కఠినమైన విధానాన్ని అవలంబించాలని అధికారులను ఆదేశించారు. వసూళ్ల ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం పన్నులు చెల్లించని డిఫాల్టర్ పరిశ్రమలు, విద్యాసంస్థలపై తక్షణమే అవసరమైన చట్టపరమైన చర్యలను ప్రారంభించాలని ఉత్తర్వులు జారీ చేశారు.

## పశ్చిమాసియాలో శాంతికి 'భారత్' ఒక్కటే మార్గం

మొదటి పేజి తరువాయి

భారతదేశం అత్యంత కీలకమైన పాత్ర పోషించాల్సి ఉందని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజర్ అభిప్రాయపడ్డారు. వేగంగా ఎదుగుతున్న ఆర్థిక శక్తిగా, బలమైన వాణిజ్య భాగస్వామిగా భారత్ ఈ ప్రాంత ముఖచిత్రాన్ని మార్చేయగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

### ట్రిలియన్ డాలర్ల వ్యాపారానికి వేదిక

ప్రపంచంలోని అన్ని ప్రధాన వాణిజ్య కూటములతో భారత్ చారిత్రాత్మక ఒప్పందాలను కుదుర్చుకుందని రూవెన్ అజర్ గుర్తుచేశారు. "పశ్చిమాసియా ప్రాంతంలో శాంతిని నెలకొల్పి, తీవ్రవాద శక్తులను అణచివేయగలిగితే.. భారత్ ద్వారా వచ్చే ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు, వస్తు రవాణా వల్ల ఇక్కడి దేశాలన్నీ అద్భుతమైన సంపదను, శ్రేయస్సును అనుభవిస్తాయి. అందుకే ఈ ప్రాంత స్థిరత్వంలో ఢిల్లీ పాత్ర ఎంతో కీలకం" అని ఆయన పేర్కొన్నారు.

### భారతీయుల్లో ఇజ్రాయెల్‌పై 'క్రేజీ లవ్'

ఇదే సమయంలో ఇరు దేశాల మధ్య ఉన్న బలమైన దౌత్య బంధాన్ని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రపంచవ్యాప్తంగా ఇజ్రాయెల్‌పై విమర్శలు వస్తున్నప్పటికీ.. భారత్ నుంచి మాత్రం తమకు అచంచలమైన ప్రజా మద్దతు లభిస్తోందని చెప్పారు. "భారత్‌లో ఇజ్రాయెల్ పట్ల ఒక అద్భుతమైన క్రేజీ లవ్ ఉంది. ప్రపంచంలో మరే దేశం నుంచి లేనంత మంది ఫాలోవర్లు నాకు ఒక్క భారతదేశం నుంచే ఉన్నారు" అని నెతన్యాహు సంతోషం వ్యక్తం చేశారు.

## పారదర్శకతే లక్ష్యం.. టీజీపీఎస్సీలో కీలక సంస్కరణలు

హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహించే అన్ని నియామక పరీక్షలను ఇకపై కంప్యూటర్ ఆధారిత విధానంలోనే (సీబీటీ) నిర్వహిస్తామని చైర్మన్ బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. ఈ విధానం ద్వారా నియామక ప్రక్రియలో మరింత భద్రత, పారదర్శకత సాధ్యమవుతుందని అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "ప్రస్తుత పరిస్థితుల్లో నియామక పరీక్షల నిర్వహణకు కంప్యూటర్ ఆధారిత విధానమే అత్యుత్తమ మార్గం. సంప్రదాయ ఓఎంఆర్ విధానంతో పోలిస్తే ఇది ఎంతో సురక్షితమైనది. పరీక్షకు గంట ముందు కూడా ప్రశ్నపత్రాన్ని సిద్ధం చేసే వెసులుబాటు ఉంటుంది" అని వివరించారు. కమిషన్‌లో అనేక సంస్కరణలు ప్రవేశపెడుతున్నామని, అభ్యర్థుల్లో విశ్వాసం నింపేందుకు సాంకేతికతను వాడుకుంటున్నామని తెలిపారు. అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలివ్వడం సాధ్యం కాదని, అందుకే పోటీ పరీక్షల్లో కొందరికి నిరాశ తప్పదని ఆయన అన్నారు. కమిషన్‌పై వచ్చే నిరాధార విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. పారదర్శకతను పెంచే ఉద్దేశంతో ఇకపై ప్రతి రెండు, మూడు నెలలకు ఒకసారి మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడిస్తామని ప్రకటించారు.

## నీట్ రీ-టెస్ట్‌పై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు.. సీబీటీ పిటిషన్ తిరస్కరణ

ఢిల్లీ: నీట్ (యూజీ) 2026 రీ-టెస్టును కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో నిర్వహించాలని దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది. దీంతో, ముందుగా నిర్ణయించిన ప్రకారం జూన్ 21న ఓఎంఆర్ విధానంలోనే ఈ పరీక్ష జరగనుంది. ఈ మేరకు ఆర్జేడీ ఎంపీ సుధాకర్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ దశలో పరీక్షా విధానాన్ని మార్చడం వల్ల తీవ్రమైన నిర్వహణాపరమైన సవాళ్లు ఎదురవుతాయని కోర్టు అభిప్రాయపడింది. సమయాభావం, ఎన్టీఏపై ఉన్న ఒత్తిడిని పరిగణనలోకి తీసుకుని ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. "ఇలాంటి అభ్యర్థనలను గతంలోనే తిరస్కరించాం. ఈ అంశాన్ని వెకేషన్ తర్వాత జులైలో విచారిస్తాం" అని జస్టిస్ నరసింహ స్పష్టం చేశారు. మే 3న జరిగిన నీట్ (యూజీ) 2026 పరీక్షలో పేపర్ లీక్ ఆరోపణలు రావడంతో దాన్ని రద్దు చేసిన విషయం తెలిసిందే. వాట్సాప్‌లో సర్క్యులేట్ అయిన 'గెస్ పేపర్'లోని సుమారు 120 ప్రశ్నలు అసలు ప్రశ్నపత్రంతో సరిపోలడంతో ఈ వ్యవహారంపై సీబీఐ విచారణ జరుగుతోంది. 22 లక్షల మందికి పైగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరీక్షను మళ్లీ నిర్వహించాలని నిర్ణయించారు. జూన్ 21న జరిగే రీ-టెస్ట్ కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) బహుళస్థాయి అథెంటికేషన్, పటిష్ఠ నిఘా వంటి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. మరోవైపు, నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు 2027 నుంచి నీట్ (యూజీ)ని సీబీటీ విధానంలో నిర్వహించేందుకు కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖతో సంప్రదింపులు జరుపుతున్నట్టు ఎన్టీఏ కోర్టుకు తెలిపింది. సుప్రీంకోర్టు తాజా నిర్ణయంతో పరీక్ష విధానంపై విద్యార్థులకు స్పష్టత లభించింది.

## మే నెలలో తిరుమలకు పోటెత్తిన భక్తులు.. శ్రీవారికి రికార్డు స్థాయి ఆదాయం

తిరుపతి: తిరుమల శ్రీవారి ఆలయానికి మే నెలలో భక్తులు పోటెత్తారు. వేసవి సెలవులు, విద్యాసంస్థలకు విరామం కావడంతో దేశవిదేశాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ నేపథ్యంలో మే మాసంలో శ్రీవారి దర్శనాలు, హుండీ ఆదాయం, తలనీలాల సమర్పణలో కొత్త రికార్డులు నమోదైనట్లు టీటీడీ తాజాగా గణాంకాలను విడుదల చేసింది. టీటీడీ వెల్లడించిన వివరాల ప్రకారం.. మే నెలలో మొత్తం 25,46,168 మంది భక్తులు శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ, భక్తుల రద్దీ తగ్గలేదు. రద్దీకి అనుగుణంగా టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ముఖ్యంగా సర్వదర్శనం భక్తులు వేచి ఉండే కంపార్ట్‌మెంట్లలో నిరంతరాయంగా తాగునీరు, పాలు, అన్నప్రసాదాలు అందించి వారికి ఇబ్బంది కలగకుండా చూసింది. స్వామివారిపై తమకున్న భక్తిని భక్తులు కానుకల రూపంలో సమర్పించారు. మే నెలలో శ్రీవారి హుండీ ద్వారా రికార్డు స్థాయిలో రూ.120.28 కోట్ల ఆదాయం లభించింది. ఒకే నెలలో ఈ స్థాయిలో ఆదాయం రావడం తిరుమల చరిత్రలోనే అరుదు. నగదుతో పాటు బంగారం, వెండి ఆభరణాలను కూడా భక్తులు పెద్దఎత్తున సమర్పించారు. ఇక, మే నెలలో 12,29,773 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

## రైతు డిస్కం పేరిట విద్యుత్తు ప్రైవేటీకరణకు కుట్ర: కె.కవిత

హైదరాబాద్: రాష్ట్రంలో రైతు డిస్కం ఏర్పాటు పేరుతో విద్యుత్తు రంగాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించే కుట్ర జరుగుతోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 'ఆరు నెలలుగా రహస్యంగా ఉంచిన రైతు డిస్కం అంశాన్ని ఇప్పుడు బయటపెట్టడం వెనుక పెద్ద వ్యూహమే ఉంది. మిగిలిన రెండు డిస్కంలను ప్రైవేటుపరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలున్నాయి. రైతుల అభిప్రాయాలు తీసుకోకుండా రైతు డిస్కం ఏర్పాటు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధం' అని పేర్కొన్నారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నారి చేయి తొలగించిన ఘటనపై ప్రభుత్వం బాధ్యత వహించాలని, బాధిత చిన్నారి పేరుపై రూ.25 లక్షలు డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు. పాలమూరు ప్రాజెక్టులో భాగమైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను దసరాలోపు ప్రారంభించాలని లేదంటే మరుసటి రోజు నుంచే పాదయాత్ర చేపడతామని కవిత హెచ్చరించారు.

## 'సర్'పై అప్రమత్తంగా ఉండాలి: కేటీఆర్

హైదరాబాద్: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై బీఆర్ఎస్ కార్యకర్తలకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ దిశా నిర్దేశం చేశారు. క్లాసిక్ గార్డెన్‌లో బీఆర్ఎస్ కంటోన్మెంట్ నియోజవర్గ స్థాయి విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జూన్ 25 నుండి సర్ ప్రారంభమవుతుందని.. సర్'పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "కాంగ్రెస్ పాలనలో పరిశ్రమలకు వారానికి మూడు రోజులు పవర్ హాలిడే ఉండేది. 65 సంవత్సరాలలో కాంగ్రెస్ చేయని పని ఆరు నెలల్లో కేసీఆర్ చేసి చూపించారు. 24 గంటల పాటు రైతులకు, పరిశ్రమలకు కేసీఆర్ నాణ్యమైన కరెంటు ఇచ్చారు" అని కేటీఆర్ గుర్తు చేశారు. "వ్యవసాయానికి రోజుకు మూడు గంటల కరెంటు ఇస్తే చాలు అన్నా రేవంత్ రెడ్డి.. ఇప్పుడేమో రైతులకు 24 గంటలు కరెంటు ఇస్తామని ప్రగల్భాలు పలుకుతున్నాడు. 35 వేల ఓటర్లు డిఫెన్స్ ల్యాండ్‌లో ఇల్లు కట్టుకున్నారు. వారి ఓటు హక్కు ఉండాలంటే సర్‌లో నమోదు చేసుకోవాలి. హైదరాబాద్‌లో మొత్తం బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించారు. గ్రామాల్లో రేవంత్ 420 మోసపూరిత హామీలను నమ్మి కాంగ్రెస్‌కు ఓట్లు వేశారు. దేశం మొత్తం కాంగ్రెస్ దరిద్రాన్ని వదిలించుకుంటే మనం నెత్తి మీద పెట్టుకున్నాం. ..సుమారు 2 లక్షల పట్టాలు కేసీఆర్ ఇచ్చారు.. రెండున్నర సంవత్సరాల్లో ఒక్క ఇండ్ల పట్టాలు అయినా రేవంత్ ఇచ్చారా?. స్కూటీ లేదు లూటీ మాత్రం నడుస్తుంది. రైతుబంధు లేదు రాహుల్ బంధు నడుస్తుంది. రైతులకు యూరియా ఇచ్చే దిక్కు లేదు. ధాన్యం కొనే దిక్కు లేదు కానీ.. రైతులకు రైతు డిస్కం తెస్తారంటా?. రైతులకు ఉరి వేయడానికే రైతు డిస్కం తెస్తున్నారు. పశ్చిమ బెంగాల్ లో 95 లక్షల ఓట్లు సర్ పేరుతో తీసేశారు.. కోర్టుకు వెళ్లారు.. కోర్టులో ఉండగానే ఎన్నికలు జరిగాయి బీహార్‌లో 65 లక్షల ఓట్లు తొలగించారు. అందరూ సర్‌లో పాల్గొని.. మన ఓట్లు తొలగించకుండా మనం అప్రమత్తంగా ఉండాలి" అని కేటీఆర్ సూచించారు.

## ఇరాన్ రాజకీయాల్లో కార్చిచ్చు: 'సైనిక తిరుగుబాటు' అంటూ అధ్యక్షుడు పెజెష్కియాన్ రాజీనామా

ఢిల్లీ: ఇరాన్‌లో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ తన పదవికి అధికారికంగా రాజీనామా చేస్తూ.. దేశ సుప్రీం లీడర్ అయాతొల్లా మొజ్తబా ఖమేనీకి లేఖ సమర్పించడం అంతర్జాతీయంగా పెను సంచలనం సృష్టిస్తోంది. దేశంలో సైన్యం 'నిశ్శబ్ద తిరుగుబాటు' (ఓబఊవ్ వీఅశ్రీఖ్షుతీఎ జశీబజా న్ష్) కు పాల్పడిందని, ఎన్నికైన పౌర ప్రభుత్వాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి అధికారాలన్నింటినీ లాగేసుకుందని పేర్కొంటూ పెజెష్కియాన్ తన రాజీనామా లేఖలో బాంబు పేల్చారు. వివిధ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ప్రకారం.. ఇరాన్ ప్రభుత్వంలో కొన్ని నెలలుగా కొనసాగుతున్న అంతర్గత పోరు ఈ నిర్ణయంతో క్లైమాక్స్‌కు చేరింది. దేశంలోని కీలకమైన, వ్యూహాత్మక నిర్ణయాలన్నింటి నుంచి తనను, తన మంత్రివర్గాన్ని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కమాండర్లు పూర్తిగా పక్కనబెట్టారని అధ్యక్షుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఏర్పడిన ఈ అధికార శూన్యతను ఆసరాగా చేసుకుని, ఐఆర్‌జీసీలోని కఠినతరమైన హార్డ్‌లైనర్ గ్రూపులు దేశ పరిపాలనను తమ గుప్పిట్లోకి తీసుకున్నాయని ఆయన ఆరోపించారు.

సైన్యం చర్యలపై తీవ్ర అసంతృప్తి

ఇటీవల పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో జరిగిన ఉద్రిక్తతలు, యూఏఈ పై జరిగిన డ్రోన్, క్షిపణి దాడుల వెనుక ఐఆర్‌జీసీ మిలిటరీ నాయకత్వమే ఉందని పెజెష్కియాన్ లేఖలో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వానికి కనీస సమాచారం కూడా లేకుండా సైన్యం ఇష్టారాజ్యంగా జరిపిన ఈ దాడులను ఆయన "కేవలం ఒక పిచ్చిచర్య (ఘీఐఅవం)" గా అభివర్ణించారు. బాధ్యతారాహిత్యమైన ఇటువంటి చర్యల వల్ల దేశం కోలుకోలేని పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. "ఇలాంటి అసాధారణ పరిస్థితుల్లో, రాజ్యాంగం నాకు కల్పించిన కనీస బాధ్యతలను కూడా నేను నెరవేర్చలేకపోతున్నాను. అందుకే ఈ పీఠంపై కొనసాగడం అర్థరహితం" అని రాజీనామా లేఖలో పెజెష్కియాన్ పేర్కొన్నారు.

ఉత్కంఠలో టెహ్రాన్.. తదుపరి ఏంటి?

తన అధికారాలను సైన్యం క్రమంగా లాగేసుకోవడాన్ని నిరసిస్తూ.. పదవి నుంచి తప్పుకునే ముందే అధ్యక్షుడు పెజెష్కియాన్ ఈ విధంగా తిరుగుబాటు జెండా ఎగరేశారు. అమెరికా – ఇరాన్ మధ్య శాంతి చర్చలు ఒక కొలిక్కి వస్తున్న తరుణంలో, ఇరాన్ దేశాధినేతే తిరుగుబాటు ఊహాగానాలను నిజం చేస్తూ తప్పుకోవడం గమనార్హం. ప్రస్తుతం ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ఈ రాజీనామాను ఆమోదిస్తారా? లేదా? అనేది సస్పెన్స్‌గా మారింది.

## తెలంగాణ ఏర్పాటును పవన్ తీవ్రంగా వ్యతిరేకించారు

హైదరాబాద్: హైదరాబాద్‌లో జనసేన అధినేత, ఏపీ పవన్ కల్యాణ్ నిర్వహించ తలపెట్టిన 'నవనిర్మాణ సభ'పై తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన.. పవన్ కల్యాణ్ తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పిన తర్వాతే ఇక్కడ సభ పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును గతంలో పవన్ కల్యాణ్ తీవ్రంగా వ్యతిరేకించారని మంత్రి పొన్నం గుర్తుచేశారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు తాను 11 రోజుల పాటు అన్నం ముట్టలేదని పవన్ చెప్పిన విషయాలను ప్రస్తావిస్తూ... అసలు ఏ నైతిక హక్కుతో ఆయన హైదరాబాద్‌లో ఇంత పెద్ద బహిరంగ సభను నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. "తెలంగాణ దృష్టి పడితే కోనసీమలో కొబ్బరి చెట్లు ఎండిపోతాయి" అంటూ గతంలో పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, భావాలను తీవ్రంగా గాయపరిచాయని పొన్నం మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలపై పవన్ సమాధానం చెప్పి తీరాలన్నారు. తెలంగాణలో రాజకీయ ప్రయోజనాల కోసం, ఇక్కడి ప్రజల మధ్య విభేదాలు సృష్టించి ద్వేషాన్ని నింపేందుకు పవన్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీని వెనుక బీజేపీతో పవన్‌కు ఉన్న 'తెరవెనుక ఒప్పందం' స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. ఈ సభ నిజంగా అభివృద్ధి కోసమే అయితే గుజరాత్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు లేదా కేరళలో పెట్టుకోవచ్చు కదా... కేవలం హైదరాబాద్‌లోనే ఎందుకు పెడుతున్నారని మంత్రి ప్రశ్నించారు. ఏపీ ప్రజలు పవన్‌కు బాధ్యతాయుతమైన పదవి ఇచ్చారని, తెలంగాణ రాజకీయాల్లో జోక్యం చేసుకోకుండా... వైజాగ్ స్టీల్ ప్లాంట్ వంటి ఆంధ్రప్రదేశ్ సమస్యలపై దృష్టి పెడితే మంచిదని హితవు పలికారు. పవన్ గనుక క్షమాపణ చెప్పకపోతే తెలంగాణ ప్రజలు ఈ సభను తీవ్రంగా వ్యతిరేకిస్తారని హెచ్చరించారు.

## ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ దినకరన్ వివాహానికి హాజరైన కావలి ప్రముఖులు





కావాలి విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్ : బి ఎస్ ఆర్ నిర్మల్ దంత వైద్యశాల అధినేత,కావలి ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ దినకరన్ డాక్టర్.క్రిస్టిన్ శనివారం జలదంకి మండలం జమ్మలపాలెం కె.వి.ఆర్ కళ్యాణ్ మండపంలో పరిశుద్ధ వివాహం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కావలి ప్రముఖులు, రాజకీయ నేతలు, బీసీ ఐక్యత భవన్ అధ్యక్షుడు ప్రభాకర్, సీనియర్ జర్నలిస్టు జయప్రతాప్ రెడ్డి, డాక్టర్లు, ఆర్ఎంపీ డాక్టర్లు, కావలి హాస్పిటల్ సిబ్బంద లు, చర్చి పాస్టర్లు సంఘ ప్రతినిధులు పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. ప్రముఖ దంత వైద్యులు గా దినకర్ సుపరిచితుడు కావడంతో పరిశుద్ధ వివాహానికి జిల్లా నుండి కాకుండా ఇతారు జిల్లాలను కూడా ప్రముఖులు భారీ స్థాయిలో హాజరయ్యారు.

## కావలి ట్రాఫిక్ సిబ్బందికి

## ఎండల నుంచి రక్షణకు ప్రత్యేక సామగ్రి పంపిణీ......



కావలి: విజ్ఞాన్ దినపత్రిక న్యూస్ : జిల్లా పోలీసు శాఖ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో నెల్లూరు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ శ్రీమతి అజిత వేజెండ్ల, ఐ.పీ.ఎస్, ఆదేశాల మేరకు కావలి పట్టణంలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి ప్రత్యేక రక్షణ సామగ్రిని పంపిణీ చేశారు.రోహిణి కార్తె నేపథ్యంలో జిల్లాలో నెలకొన్న తీవ్రమైన ఎండలు, అధిక ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని ఈరోజు కావలి డీఎస్పీ శ్రీ వి.వి. రమణ కుమార్ ఆధ్వర్యంలో డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో ట్రాఫిక్ సిబ్బందికి తెలుపు రంగు టోపీలు, చలువ అద్దాలు (సన్ గ్లాసెస్), వాటర్ బాటిళ్లు అందజేశారు.ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీ వి.వి. రమణ కుమార్ గారు ట్రాఫిక్ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ, ...

## "లోకేష్ రాజీనామా చేయాలి - కాకాణి"







లినెల్లూరు సిటీ... జూన్ 1/(విజ్ఞాన్ ప్రతి నిధి ): డిఎస్సీ పరీక్షల నిర్వహణలో, అభ్యర్థుల ఎంపికలో,అనేక అవకతవకలు జరిగి, నిరుద్యోగులు రోడ్డున పడ్డారు. వైఎస్ఆర్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలోసోమవారం నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ సభ్యులు మద్దెల గురుమూర్తి , శాసనమండలి సభ్యులు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు రూరల్ ఇంచార్జి ఆనం విజయకుమార్ రెడ్డి ,వైయస్సార్ సీపీ నాయకులతో ,కలిసి నెల్లూరు నగరంలోని విఆర్ సి సెంటర్ వద్ద గల డా.బి.ఆర్.అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి భారీ ర్యాలీగా కలెక్టరేట్ కు చేరుకున్నారు..... ఈ సందర్భంగా అక్రమాలపై విచారణ జరపాలని కోరుతూ వినతి పత్రం సమర్పించిన ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు "డా" కాకాణి గోవర్ధన్ రెడ్డిమాట్లాడుతూ లిమెగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయాన్ని - కూటమి ప్రభుత్వం ఊరించి..ఊరించి మెగా డీఎస్సీ ప్రక్రియలో భారీ ఎత్తున అవినీతి, అక్రమాలు జరిపిందని విమర్శలు చేశారు...- ఎన్నికలకు ముందు "మెగా డీఎస్సీ" అంటూ నిరుద్యోగుల్లో ఆశలు రేపి, ప్రభుత్వం రాగానే తొలి సంతకం దానిపైనే చేస్తామని నమ్మబలికారని - తీరా అధికారంలోకి వచ్చాక కాలయాపన చేస్తూ, 2024లో విడుదల చేయాల్సిన డీఎస్సీని 2025 వరకు సాగదీసి నోటిఫికేషన్ ఇచ్చారని ఆరోపించారు...- డీఎస్సీలో అనేక పొరపాట్లు జరిగాయి, ఉపాధ్యాయులకు సంబంధించిన పోస్టులను అమ్ముకుని , అర్హులైన అభ్యర్థులకు తీవ్ర ద్రోహం, అన్యాయం చేశారని అన్నారు...- కనీసం మెరిట్ లిస్ట్ గానీ, సెలెక్టెడ్ లిస్ట్ గానీ అధికారికంగా ప్రకటించకుండానే.. అభ్యర్థులకు నేరుగా మెసేజ్‌లు పంపారని ఈ ఎక్కడి న్యాయం అన్నారు...- అర్హత కలిగిన వారు మూడు, నాలుగు పోస్టులకు అర్హత ఉన్నప్పటికీ.. వారికి కేవలం ఒక్క పోస్టుకే అవకాశం కల్పించి అన్యాయం చేసారని మండి పడ్డారు...- మెగా డీఎస్సీ ప్రక్రియపై గౌరవ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి, ప్రభుత్వానికి చీవాట్లు పెట్టినప్పటికీ.. కోర్టుకు సైతం తప్పుడు సమాచారం ఇచ్చారని ప్రభుత్వం తీరును పప్పు పట్టారు...- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, నిరుద్యోగుల పక్షాన నిలబడి వారికి న్యాయం జరిగేంత వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు..

## మున్సిపల్ కార్పొరేషన్ల వార్డుల పునర్విభజన

**విశాఖపట్నం, మచిలీపట్నం**



ప్రక్రియను నిలువరించాలని కోరుతూ వేర్వేరుగా దాఖలైన రెండు పిటిషన్లపై హైకోర్టు విచారణ జరిపింది. వేసవి సెలవుల అనంతరం ఈ వ్యాజ్యాలపై రెగ్యులర్ బెంచ్ విచారణ జరుపుతుందని పేర్కొంటూ.. వార్డుల పునర్విభజన ప్రక్రియపై అప్పటి వరకు స్టే విధించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తుహిన్‌కుమార్ శు క్రవారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. జీవీఎంసీ వార్డుల పునర్విభజనను సవాల్ చేస్తూ నరసింహ ప్రతాప్, మచిలీపట్నంలో వార్డుల పునర్విభజనపై మహ్మద్ ఖలేలుర్ రహ్మాన్ పిటిషన్ వేశారు. ఇదే విధంగా నెల్లూరు నగర కార్పొరేషన్ లో ప్రస్తుతం ఉన్న 54 డివిజన్లను పునర్విభజన చేసి 72 డివిజన్లుగా చేశారు. దీనిపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయనుంది...హైకోర్టు దీనిని స్వీకరిస్తే నెల్లూరుకు సంబంధించి ఎలాంటి ఆదేశాలు వస్తాయో వేచి చూడాల్సిందే నని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

## సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలపై

## మంత్రితో చర్చించిన టీఎన్ఎస్ఎఫ్ నేత దార్ల శివకుమార్



విజ్ఞాన్ దినపత్రిక న్యూస్ : ఒంగోలు: సోషల్ వెల్ఫేర్, సచివాలయాలు, వాలంటీర్లు మరియు సీనియర్ సిటిజన్ సంక్షేమ శాఖల మంత్రివర్యులు డోలా బాల వీరాంజనేయ స్వామిను ఒంగోలులోని ఆయన నివాసంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దార్ల శివకుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లలో విద్యార్థులకు అందుతున్న మౌలిక సదుపాయాలు, హాస్టళ్ల నిర్వహణ, వసతి, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై దార్ల శివకుమార్ మంత్రికి పలు సూచనలు చేశారు.విద్యార్థుల సంక్షేమం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, హాస్టళ్లలో మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అనుకూలమైన వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ భేటీ సానుకూల వాతావరణంలో జరగగా, విద్యార్థుల సంక్షేమం మరియు సోషల్ వెల్ఫేర్ హాస్టళ్ల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## ప్రజల సమస్యలను అధికారుల దృష్టికీ

## తీసుకు వెళుతున్న సైదాపురం జనసేన నాయకులు



సైదాపురం విజ్ఞాన్ దినపత్రిక, జూన్ 01: సైదాపురం మండలం లో జరుగుతున్న రీ సర్వే పనులను వేగంగా పూర్తి చేసి సాగు లో వున్న రైతులకు పట్టా దారు పాసుపుస్తకాలు అందించాలని సైదాపురం మండలం జనసేన పార్టీ తరపున మండలం నాయకులు తహశీల్దార్ ఎం సుభద్ర ను సోమవారం గ్రీవెన్స్ లో కోరారు.అలాగే మండలం లోని సామాజిక ,సాముహిక మరుగుదొడ్ల నిర్మాణాల చేపట్టడం గురించి, మూగ జీవాలకు మండలం లోని రోడ్లు వెంట త్రాగునీటికి తోట్టెల నిర్మాణాల గురించి, సిద్ధల కోనకు వెళ్ళే మార్గం లో కోన వరకు వీధి దీపాలు, కోన వద్ద మినరల్ ప్లాంట్ సిద్ధల కోనకు వచ్చే భక్తులకు అక్కడ నివాసం ఉండే గిరిజనులకు మినరల్ వాటర్ సౌకర్యం ఏర్పాటు చేయాలని ఎం పి డి ఓ రామ్మోహన్ రెడ్డి కి జనసేన సీనియర్ నాయకులు చింతలపల్లి రవీంద్రనాథ్ నాయకత్వం లో మండలం లోని నాయకులు షేక్ షరీఫ్, ఊస ప్రసన్నకుమార్ తదితరులు కలిసి సమస్యలు పరిష్కారం కోరుతూవినతి పత్రం సమర్పించారు.

## పేదలకు మెరుగైన కంటి చూపు అందించడమే విపిఆర్ నేత్ర సంకల్పం.

**-ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**





పేద ప్రజల కంటి సమస్యలను తీర్చి, వారి జీవితాల్లో వెలుగులు నింపడమే విపిఆర్ నేత్ర సంకల్పమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిఅన్నారు..సోమవారం విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొడవలూరు మండలం కమ్మపాళెంలో ఏర్పాటు చేసిన విపిఆర్ నేత్ర కంటి వైద్య శిబిరంను ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా కంటి పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలతో మాట్లాడి, అందిస్తున్న సేవలపై ఆరా తీశారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ, ఈ విపిఆర్ నేత్ర ప్రాజెక్ట్ నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కలల ప్రాజెక్ట్ అన్నారు. తొలుత ఉదయగిరి నియోజకవర్గంలో ఈ బస్సు ద్వారా ప్రతి గ్రామానికి వెళ్లి 47434 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించామని, అందులో 26434 మందికి కళ్లద్దాలను పంపిణీ చేశామన్నారు..మొబైల్ బస్సులో అత్యంత ఆధునిక సాంకేతిక పరికరాలు (అడ్వాన్స్ ఎక్విప్‌మెంట్) ఉన్నాయని ఆమె తెలిపారు. గ్రామాల వద్దకే వచ్చి కంటి పరీక్షలు చేయడమే కాకుండా, కంటి చూపు సమస్య ఉన్న వారికి కేవలం అరగంట లోపలే అక్కడికక్కడే కళ్లద్దాలు అందిస్తున్నట్లు తెలిపారు. మరింత తీవ్రమైన సమస్యలు ఉన్న వారికి నిపుణులైన డాక్టర్లు, టెక్నీషియన్లు తదుపరి చికిత్స కోసం తగిన సలహాలు ఇస్తున్నామని వివరించారు.ఉదయగిరి నియోజకవర్గంలో వచ్చిన అద్భుత స్పందనను చూసి, కేవలం ఒక బస్సుతో ఏడు నియోజకవర్గాలను పూర్తి చేయడం కష్టమని భావించి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మరొక బస్సును తీసుకువచ్చినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా, కోవూరు నియోజకవర్గంలోని రామతీర్థం నుండి ఈ రెండో బస్సు సేవలను ప్రారంభించామని చెప్పారు.జిల్లాలో వి.పి.ఆర్ నేత్ర ప్రస్తుతం రెండు ప్రత్యేక బస్సులు ద్వారా నిర్వహిస్తున్నామన్నారు.విడవలూరు మండలంలో విపిఆర్ నేత్ర పూర్తి చేశామన్నారు.మండలంలో గల 15 పంచాయతీలలో 7273 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని ,వారిలో అవసరమైన 4759 మందికి కంటి అద్దాలు అందజేశామన్నారు..కొడవవలూరు మండలంలో గల 24 గ్రామ పంచాయతీలలో ఇప్పటివరకు 11 పంచాయతీలలో పూర్తి చేశామన్నారు.కార్యక్రమం ఇంకాకొనసాగుతోందన్నారు..ఇప్పటివరకు 3022 మందికి పరీక్షలు నిర్వహించామని, రెండు వేల మందికి పైగా కంటి అద్దాలు అందజేశామన్నారు.కోవూరు నియోజకవర్గం లోని 82 గ్రామ పంచాయతీలలో ఇప్పటి వరకూ 26 పంచాయతీలలో విపిఆర్ నేత్ర పూర్తి చేశామన్నారు.అందులో 10295 మందికి కంటి పరీక్ష చేసి ,6760 మందికి కంటి అద్దాలుఅందజేశామన్నారు.తాము రాజకీయాల్లోకి వచ్చింది కేవలం ప్రజలకు సేవ చేయడానికేఅన్నారు..విపిఆర్ ఫౌండేషన్ తరపున జరిగే ఏ కార్యక్రమమైనా పార్టీలకు అతీతంగాజరుగుతుందన్నారు. ఇందులో పార్టీ భేదాలు లేవన్నారు. ఇది పేద ప్రజల కోసం మేము చేస్తున్న సేవ అన్నారు. నెల్లూరు వంటి నగరాలకు వెళ్లి కంటి పరీక్షలు చేయించుకోవాలంటే పేద ప్రజలకు సమయం, డబ్బు భారం అవుతాయని, అటువంటి ఇబ్బంది లేకుండా గ్రామాల లో పేదల కు అందుబాటులోకి ఈ సేవలను తీసుకువచ్చామన్నారు. శిబిరంలో పరీక్షలు చేయించుకుని కళ్లద్దాలు పొందిన లబ్ధిదారులు వ్యక్తపరుస్తున్న ఆనందమే తమ సేవా దృక్పథానికి నిజమైన సార్థకత అని ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. గ్రామాల్లోని నాయకులు కూడా చొరవ తీసుకుని ఈ బస్సు సేవలను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.ఎండలను సైతం లెక్కచేయకుండా విపిఆర్ ఫౌండేషన్ ఛీఫ్ కోఆర్డినేటర్ ఎన్ శంకర్ ఆధ్వర్యంలో, విపిఆర్ నేత్ర టెక్నికల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఏవిఎస్ కృష్ణప్రసాద్ పర్యవేక్షణలో రెండు క్యాంపులను దిగ్విజయంగా నడుపుతున్న వైద్య సిబ్బందిని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట:

- కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి
- పెన్షన్ల పంపిణీ లోపాల్గొన్నఎమ్మెల్యే ప్రశాంతమ్మ
- అర్జీల పరిష్కారానికి అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు
- చంద్రబాబు నాయుడు కాలనీలో రూ. 10 లక్షల తాగునీటి

పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేసిన వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి





విజ్ఞాన్ దినపత్రిక: కోవూరు రిపోర్టర్‌దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో మహిళలను అన్ని రంగాల్లో ముందుండాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి నారా౼ంద్రబాబు నాయుడు , యువనేత నారా లోకేష్ బాబుమహిళలకు 33% చారిత్రాత్మక రిజర్వేషన్ ప్రకటించారని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం కొడవలూరు మండలం నార్త్ రాజుపాలెం



పరిధిలోని చంద్రబాబు నాయుడు కాలనీలో జరిగిన "పేదల సేవలో - పెన్షన్ పంపిణీ, తాగునీటి సరఫరా పైపులైన్ శంకుస్థాపన" కార్యక్రమంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీ చేసిన అనంతరం కాలనీలో రూ. 10 లక్షల వ్యయంతో చేపట్టనున్న తాగునీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారత, నియోజకవర్గ అభివృద్ధి, యువతకు ఉద్యోగ అవకాశాలపై కీలక ప్రసంగం చేశారు.ఇటీవల నిర్వహించిన మహానాడును "స్త్రీ శక్తి" థీమ్‌తో అద్భుతంగా జరుపుకున్నామని ఎమ్మెల్యే తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ మహిళల పక్షపాతి అని, అందుకు ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఇప్పటికే ఇద్దరు మహిళా ఎమ్మెల్యేలు ఉండటమే నిదర్శనమన్నారు. మహానాడులో పార్టీ ప్రకటించిన 33% రిజర్వేషన్‌తో ప్రతి దాంట్లోనూ మహిళలకు అత్యున్నత ప్రాధాన్యత, గౌరవం లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం.. మహిళల కోసం 'తల్లికి వందనం', 'స్త్రీ శక్తి' కింద ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందని గుర్తుచేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి... రెండింటినీ కలిపి ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు.ప్రతి నెల ఒకటో తేదీనే లబ్ధిదారులకు పెన్షన్లు అందిస్తున్నామని, నేడు కూడా ఒకటో తేదీనే పెన్షన్ల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా జరిగిందన్నారు.దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు జయంతి సందర్భంగా కోవూరు నియోజకవర్గం, కొడవలూరు మండలం చంద్రశేఖరపురంలో మొదటగా జరగాల్సిన ఈ మహానాడును..మారుతున్న పరిస్థితులు, దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజయవాడ నుండి 1875 క్లస్టర్లతో ఆన్‌లైన్ ద్వారా డిజిటల్ రూపంలో "పొదుపు మహానాడు"ను విజయవంతంగా నిర్వహించారన్నారు.44 సంవత్సరాల క్రితం పుట్టిన తెలుగుదేశం పార్టీలో నాయకులు ఉన్నా లేకపోయినా, ఆన్‌లైన్ ద్వారా ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో పాల్గొని జయప్రదం చేయడం ద్వారా పార్టీ నిర్మాణం, కార్యకర్తల నిబద్ధత మరియు బలం మరోసారి నిరూపితమయ్యాయని ఆమె పేర్కొన్నారు.తాను పొలిట్ బ్యూరో మెంబర్‌గా మంగళగిరిలో ఉండటం వల్ల ఇక్కడ అందుబాటులో లేనప్పటికీ.. కోవూరు నియోజకవర్గ కార్యకర్తలు, గ్రామ కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులు, కన్వీనర్లు, ఐటిడిపి యాప్ ప్రతినిధులు క్రమశిక్షణతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలబెట్టారని కొనియాడారు. ఈ నిబద్ధతకు గానూ కార్యకర్తలందరికీ ఎమ్మెల్యే ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యకర్తలను చూసి ఓర్వలేకే ప్రతిపక్ష వైసీపీ మహానాడుపై హేళనగా మాట్లాడుతోందని మండిపడ్డారు. కార్యకర్తకు ఉన్నత స్థానం అవకాశం కల్పించే అలవాటు లేని పార్టీ వైఎస్ఆర్సిపి పార్టీ అని,దాన్ని చూసి జీర్ణించుకోలేక ఈరోజు మన జిల్లాలో గాని, రాష్ట్రంలో గాని ఈ మహానాడు గురించి హేళనగా మాట్లాడుతున్నారు. అది తప్పనీ,.. ఏ పార్టీలో ఉన్నా కార్యకర్త కార్యకర్తే అనీ,. ఇది కార్యకర్తల పండుగనీ, కార్యకర్తలు చేసిన పండుగ ని అన్నారు.. దాన్ని అందరూగౌరవించాలన్నారు..యువనేత నారా లోకేష్ బాబు తన 'యువగళం' పాదయాత్రలో కోవూరు లో యువతకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రానికి దాదాపు 23 లక్షల కోట్ల పెట్టుబడులను తీసుకువచ్చారని ఆమె తెలిపారు. ఇందులో భాగంగానే మన కొవూరు నియోజకవర్గంలో సుమారు రూ. 13వేల కోట్ల పెట్టుబడులతో భారీ ఫ్యాక్టరీలు రాబోతున్నాయని, దీని ద్వారా స్థానికంగా చదువుకున్న యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. గత ప్రభుత్వంలో ఉద్యోగాల ఊసే లేదని, కానీ తమ ప్రభుత్వం రాగానే 16,000 పోస్టులతో 'మెగా డీఎస్సీ' ప్రకటించిందని, పోలీసు ఉద్యోగాలను కూడా భర్తీ చేస్తున్నామని చెప్పారు.నిరుద్యోగ, యువజన మరియు ప్రజా శ్రేయస్సు కోరే ఈ ప్రభుత్వానికి ప్రజలందరూ రాబోయే రోజుల్లోనూ పూర్తి మద్దతు తెలపాలన్నారు.ఈ సందర్భంగా స్థానిక మహిళలు, నాయకులు ఇళ్ల స్థలాల కోసం ఇచ్చిన అర్జీలపై ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తక్షణమే స్పందించారు. ప్రభుత్వ స్థలాలు ఎక్కడైనా ఆక్రమణలో ఉంటే, వాటిని స్వాధీనంచేసుకోవాలన్నారు.వాటిని ఇళ్ల స్థలాలు లేని పేదలకు అందజేయాలని అక్కడికక్కడే ఉన్న తహసీల్దార్ కు ఆదేశించారు. ప్రజలు సమర్పించిన అర్జీలను తాను స్వయంగా రెవెన్యూ మంత్రి తోపాటు, సీఎం దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వమన్నారు. స్థానిక దేవాలయ అభివృద్ధి పనులను నెల రోజుల్లోగా పూర్తి చేస్తామని, కాలనీలో తాగునీటి సమస్యను పది రోజుల్లోగా పరిష్కరించాలని అధికారులకుసూచించారు..ఈకార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, రెవెన్యూ అధికారులు, ఐటిడిపి ప్రతినిధులు, చంద్రబాబు నాయుడు కాలనీ మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కోవూరులో హైబ్రిడ్ మహానాడు గ్రాండ్ సక్సెస్

- కార్యకర్తల కష్టానికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా
- మహానాడు విజయోత్సవ సమావేశంలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి



రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన హైబ్రిడ్ మహానాడును విజయవంతం చేసిన కోవూరు నియోజకవర్గంలోని ప్రతి నాయకుడు, కార్యకర్తకు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మహానాడు విజయోత్సవం సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్, కో-క్లస్టర్ ఇన్‌ఛార్జీలు, ఐటీడీపీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు.మహానాడు విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరినీ వ్యక్తిగతంగా అభినందించాలనే ఉద్దేశంతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలోనే



మండలాల వారీగా గ్రామ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌ఛార్జీలు, ఇతర నాయకులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, మహానాడు విజయానికి వారు చేసిన కృషిని స్వయంగా తెలుసుకుంటానని చెప్పారు.తెలుగుదేశం పార్టీ స్థాపనకు 44 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు జయంతి వేళ మహానాడును నిర్వహించడం గర్వకారణమన్నారు. కోవూరులో మహానాడు నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ నిర్ణయించిన రోజునుంచే నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల్లో చాలా ఉత్సాహం కనిపించిందన్నారు. అందరూ ముందుకొచ్చి మహానాడుకు విజయవం చేస్తామని చెప్పారన్నారు.అయితే ప్రస్తుత పరిస్థితుల్లో దేశ ప్రయోజనాలు, పొదుపు అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రధాని నరేంద్ర మోదీ సూచనల మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హైబ్రిడ్ మహానాడుకు రూపకల్పన చేశారని పేర్కొన్నారు. కోవూరులో భారీ స్థాయిలో నిర్వహిస్తే అయ్యే ఇంధన వినియోగాన్ని తగ్గించాలనే లక్ష్యంతో ఈ వినూత్న విధానాన్ని అమలు చేశారని వివరించారు.రాష్ట్రవ్యాప్తంగా 1,875 క్లస్టర్లలో ఆన్‌లైన్ ద్వారా మహానాడును నిర్వహించడం పార్టీ చరిత్రలో కొత్త అధ్యాయమని అన్నారు. నారా లోకేష్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత నిర్వహించిన తొలి మహానాడు ఇదేనని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో మహానాడు విజయవంతం కాదని విమర్శించిన వారికి తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ, సంస్థాగత బలం ఏమిటో కార్యకర్తలు నిరూపించారని చెప్పారు. పార్టీ నాయకత్వం ఇచ్చిన ఒక్క పిలుపుకు రాష్ట్రవ్యాప్తంగా కార్యకర్తలు స్పందించి మహానాడును చరిత్రాత్మక విజయంగా నిలిపారని కొనియాడారు. నాయకుడి పిలుపును కార్యకర్తలు ఎంత కట్టుబాటుతో పాటిస్తారో ఈ మహానాడు ద్వారా రాష్ట్రానికి తెలియజేశారని అన్నారు. మహానాడు విజయానికి కృషి చేసిన కార్యకర్తలందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెలిపారు.మహానాడు నిర్వహణలో ఐటీడీపీ సభ్యులు చేపట్టిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రత్యేకంగా ప్రశంసనీయమని తెలిపారు. అందరూ తమ బాధ్యతలను సమర్థంగా నిర్వహించి రాష్ట్రంలోనే కోవూరుకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని అన్నారు. క్లస్టర్ ఇన్‌ఛార్జీలు, మండల అధ్యక్షులు, నాయకులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారని పేర్కొన్నారు. తాను ప్రత్యక్షంగా లేకపోయినా ప్రతి క్లస్టర్‌లో జరుగుతున్న కార్యక్రమాలపై నిరంతరం సమాచారం అందుతూనే ఉందన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మంగళవారం విజయవాడలో జరిగే సమావేశానికి హాజరై తిరిగి వచ్చిన అనంతరం బుధవారం నుంచి మండలాల వారీగా సమావేశాలు నిర్వహిస్తానన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఓటరు నమోదు కార్యక్రమంలో ప్రతి నాయకుడు, కార్యకర్త చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఇందుకు సంబంధించిన శిక్షణ అనంతరం ప్రతి మండలంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలిపారు.కోవూరు నియోజకవర్గ సుమారు 60 ఏళ్ల రాజకీయ చరిత్రలోమొట్టమొదటిసారిగా ఒక మహిళకు పోటీ చేసే అవకాశం కల్పించిన ఘనత చంద్రబాబు నాయుడు ది, లోకేష్ బాబు దని చెప్పారు. ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తిని సైతం ఓడించేలా తనకు అవకాశం కల్పించారని పేర్కొన్నారు. గతంలో ఆ వ్యక్తి తనపై అవగాహన లేకుండా అవాకులు చవాకులు పేలినప్పుడు చంద్రబాబు తన బిడ్డలాగా, లోకేష్ తన తల్లిలా భావించి తనకు అండగా నిలిచారని చెప్పారు. మహిళకు అన్యాయం జరిగినప్పుడు నాయకత్వం ఎలా అండగా నిలబడుతుందో కోవూరు ప్రజలంతా చూశారని అన్నారు. మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వడం ఎంతో గొప్ప విషయమని పేర్కొన్నారు. నాయకులంతా తమ ఇళ్లలోని భార్యలను, అమ్మలను రాబోయే రోజుల్లో రాజకీయాల్లోకి ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఒక మహిళ ఏదైనా సాధించాలని నిర్ణయించుకుంటే ఖచ్చితంగా సాధించి తీరుతుందని చెప్పారు.తెలుగుదేశం పార్టీలో కార్యకర్తలే అసలైన అధినేతలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మొన్నటి మహానాడు వేదికపై ఎంతోమంది సామాన్య కార్యకర్తలు స్టేజ్ పైకి వచ్చి మాట్లాడటమే దీనికి నిదర్శనమన్నారు. ఒక సామాన్య క్లస్టర్ ఇన్‌ఛార్జీని, మండల అధ్యక్షులను పొలిట్ బ్యూరో మెంబర్లుగా గౌరవించే ఏకైక పార్టీ టీడీపీ అని చెప్పారు. అలాంటి పార్టీలో ఉండటం అందరి అదృష్టమని పేర్కొన్నారు.పార్టీలో ఎలాంటి గ్రూపులు, చిన్నపాటి తగాదాలు ఉన్నా వాటిని పూర్తిగా పక్కన పెట్టాలని సూచించారు. కేవలం పార్టీ కోసం, నారా చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని బలపరచడం కోసం అందరూ స్వచ్ఛందంగా కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు రెండు రోజుల పాటు పడ్డ కష్టాన్ని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కూడా ప్రశంసించారని తెలిపారు. మీరంతా పడిన కష్టాన్ని తాను ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటానని చెప్పారు. మీ కోసం పనిచేసే మీ ఎమ్మెల్యేకు, మీ ముఖ్యమంత్రికి, పార్టీకి మీరంతా తగిన గౌరవం ఇవ్వాలని కోరారు.


Printed by: komalagunta Nageswara Rao D.NO.16-256/3,UP Stair,Near Hanuman Temple, sankaraiah Buildings,Rayaji street, Nellore, sri potti sriramulu Nellore Dist. ANDHRAPRADESH PiNNo-524001, Published by : KALIKI UDAYKUMAR REDDY D.NO.Lig1-697, kalluru palli Housing Board colony, Nellore-524004 S.P.S.R Nellore District, Owned by : KALIKI UDAYKUMAR REDDY D.NO.Lig1-697, kalluru palli Housing Board colony, Nellore-524004 S.P.S.R Nellore District, Printed at : Deepak roshan Graphics Digital&Mutt colour printers, D.NO.16-256/3,UP Stair,Near Hanuman Temple, sankaraiah Buildings,Rayaji street, Nellore, sri potti sriramulu Nellore Dist. ANDHRAPRADESH PiNNo-524001, published at :D.NO.Lig1-697, kalluru palli Housing Board colony, Nellore-524004 S.P.S.R Nellore District, Editor : KALIKI UDAYKUMAR REDDY D.NO.Lig1-